క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


డెంగీ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మురళీకృష్ణ

సత్యవేడు: సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని దాసుకుప్పం పీహెచ్‌సీ డాక్టర్ బి.మురళీకృష్ణ తెలిపారు. మంగళవారం స్థానిక ఆస్పత్రిలో ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లతో కలసి డయేరియాపై తీసుకోవాల్సిన జాగ్రత్తలకు సంబంధించి పోస్టర్లు విడుదల చేసి, వ్యాధి లక్షణాలను వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో ఎలాంటి వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాల శుభ్రత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ సుబ్రమణ్యం, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

సింగిల్ విండో పర్సన్ ఇన్‌చార్జిగా రవిబాబు



బుచ్చినాయుడుకండ్రిగ: కాటూరు సింగిల్ విండో సొసైటీ పర్సన్ ఇన్‌చార్జిగా, శ్రీకాళహస్తి సబ్ డివిజనల్ కో–ఆపరేటివ్ కార్యాలయ అసిస్టెంట్ రిజిస్ట్రార్ రవిబాబు బాధ్యతలు స్వీకరించారు. సింగిల్ విండో త్రీమెన్ కమిటీ చైర్మన్‌గా ఉన్న హరినాథరెడ్డి ప్రభుత్వం మారడంతో ఈ నెల 9వ తేదీన తన పదవికి రాజీనామా చేశారు. దీంతో సింగిల్ విండో సొసైటీ పర్సన్ ఇన్‌చార్జిగా రవిబాబును నియమించారు. ఈయన్ని కార్యాలయ సీఈఓ మహేష్‌రెడ్డి, సిబ్బంది అభినందించారు. రైతులకు పంట రుణాలను సకాలంలో అందిస్తామని రవిబాబు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

శ్రీకాళహస్తి: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీజేపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చంద్రప్ప అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు ఏక్ పెడ్ మా కే నామ్(అమ్మ పేరుతో చెట్టు నాటుదాం) అనే కార్యక్రమంలో భాగంగా మంగళవారం చంద్రప్ప తన తల్లి పేరున ఓ మొక్క నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కల పెంపకంతోనే మానవ మనుగడ సాధ్యమన్నారు.

ముక్కంటి సేవలో మాడుగుల ఎమ్మెల్యే


ఆలయ ధ్వజస్తంభం వద్ద ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామివారిని మంగళవారం విజయనగరం జిల్లా మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించి, స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయాధికారులు తదితరులు పాల్గొన్నారు.

డ్రమ్ములు, టార్పాలిన్ పట్టల పంపిణీ

నారాయణవనం: మండలంలో షెడ్యూల్ కులాల రైతులకు ప్రకృతి వ్యవసాయానికి డ్రమ్ములు, టార్పాలిన్ పట్టలను ఎమ్మెల్యే ఆదిమూలం అందజేశారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మానవాళికి, భూమికి రసాయన రహిత ప్రకృతి సేద్యం ఎంతో శ్రేయస్కరం అన్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడంలో భాగంగా షెడ్యూల్ కులాల రైతులకు డ్రమ్ములు, టార్పాలిన్ పట్టలను ఉచితంగా అందిస్తున్నట్లు ఎమ్మెల్యే ఆదిమూలం తెలిపారు. రైతులు, అధికారులు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆడికృత్తిక ఉత్సవాల నిర్వహణ

పాకాల: స్థానిక ఊట్లవారిపల్లికి సమీపంలోని ఆనందగిరి కొండపై వెలసిన శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణ్య స్వామివారి ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించాలని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం అధికారులతో సుబ్రహ్మణ్య స్వామి ఆలయ ఆవరణలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 27వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలకు ఇతర జిల్లాల నుంచి కూడా పెద్దసంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందని, అందుకు తగ్గట్టు మౌలిక సౌకర్యాలను కల్పించాలన్నారు. భక్తులకు తాగునీటి సమస్య రానివ్వకుండా చూడాలని, భక్తుల వాహనాలను పార్కింగ్ చేయడానికి సరైన పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్‌శాఖ రెవెన్యూ శాఖ, రక్షిత తాగునీటి శాఖ, పోలీసులు సమన్వయంతో ఉత్సవాలను విజయవంతం చేయడానికి కృషి చేయాలన్నారు.

బడిఈడు పిల్లలు పాఠశాలలోనే ఉండాలి

- 'నేను బడికి పోతా' కార్యక్రమంలో డీఈఓ శేఖర్


రేణిగుంట మండలం కరకంబాడి హైస్కూల్ ఆవరణలో జరిగిన 'నేను బడికి పోతా' ర్యాలీలో డీఈఓ శేఖర్

రేణిగుంట: బడిఈడు పిల్లలందరూ పాఠశాలలోనే ఉండాలని, క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని డీఈఓ శేఖర్ అన్నారు. రేణిగుంట మండలం కరకంబాడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం 'నేను బడికి పోతా' ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన విద్యార్థులతో కలసి ర్యాలీలో పాల్గొన్నారు. గ్రామ సమీపంలోని సిమెంటు ఇటుకల తయారీ ప్రాంతం, కోళ్ల ఫారాల సమీప ప్రాంతం, చైతన్యపురంలో బడి మానేసిన విద్యార్థులను కరకంబాడి ఉన్నత పాఠశాలలో చేర్పించి, క్రమంగా బడికి పంపాలని పిల్లల తల్లిదండ్రులకు తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ జూలై 12వ తేదీ లోపు బడి మానేసిన పిల్లలను గుర్తించి, మళ్లీ పాఠశాలలో చేర్పించాలని సూచించారు. బడిలో చేరిన పిల్లలకు వెంటనే స్టూడెంట్ కిట్ ఇతర ప్రోత్సాహకాలు అందించాలన్నారు. ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సీఆర్‌ఎంటీలు బడి బయట ఉన్న పిల్లలందరినీ బడిలో చేర్పించే బాధ్యత తీసుకోవాలన్నారు. విద్యార్థులను వయస్సుకు తగిన తరగతిలో చేర్పించి, ఆ తరగతి స్థాయిని అందుకునేందుకు బ్రిడ్జ్ కోర్సును అమలు చేయాలని తెలిపారు. పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్, విద్యార్థి కిట్లు ఇచ్చే ప్రతి సామగ్రి ప్రతి విద్యార్థికీ అందాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు ఇందిరాదేవి, రంగనాథం, పాఠశాల హెచ్‌ఎం పుష్పలత, సమగ్ర శిక్ష జిల్లా అధికారులు మధు, రుక్మాంగద, సారథి, గోపాల్, రాము, ఉపాధ్యాయులు ముత్యాలరెడ్డి, రామచంద్రయ్య, రవీంద్ర, భూపతిరెడ్డి, సురేష్, మురళి, గోపి, రెడ్డెయ్య, శ్రీనివాసులు, వెంకటలక్ష్మి, ప్రగతి స్వచ్ఛంద సంస్థ మండల కోఆర్డినేటర్ జయలక్ష్మి పాల్గొన్నారు.

బడిలోకి విద్యార్థులు


పాఠశాలలో చేరిన విద్యార్థులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని లక్ష్మీపురం, మూలబొందలు, మైక్రోవేవ్‌స్టేషన్, కనమనంబేడు గిరిజన కాలనీల్లోని బడి మానేసిన పిల్లలను తిరిగి పాఠశాలలో చేర్పించారు. నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా మంగళవారం బుచ్చినాయుడు కండ్రిగలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఐదుగురు పిల్లలను ఎంఈఓలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం చేర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం ప్రకారం బడిఈడు పిల్లలంతా బడిలోనే ఉండాలని తెలిపారు. బడి మానేసిన పిల్లలను తిరిగి చేర్పించేలా తల్లిదండ్రులు చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రమణయ్య, సీఆర్‌పీ ప్రసూన, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైళ్ల రాకపోకలకు అంతరాయం


ఏర్పేడు రైల్వే స్టేషన్ సమీపంలో ఆగిన రైలు

ఏర్పేడు: మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్ సమీపంలో రెండు రోజులుగా రైళ్ల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. ఏర్పేడు రైల్వేస్టేషన్ సమీపంలో రెండు రోజులుగా రైల్వేట్రాక్ మరమ్మతు పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో శ్రీకాళహస్తి, తిరుపతి మార్గాల వైపు వెళ్లే రైళ్లు, గూడ్స్ రైళ్లు గంటల తరబడి ఆగిపోతున్నాయి. సుదూర ప్రాంతాలు, ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర సమస్యలపై వెళ్లే ప్రయాణికులు తగిన సమయానికి గమ్యానికి చేరుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో మంగళవారం తిరుపతి నుంచి శ్రీకాళహస్తి వైపు వెళ్లే రైలు ఉదయం 7 గంటలకు అంజిమేడు పంచాయతీ పరిధిలోని పోతుమానిగుంట ఎస్టీ కాలనీ గేటు వద్ద సిగ్నల్ పడకపోవడంతో ఆగిపోయింది. తిరిగి ఉదయం 7.40 గంటలకు రైలుకు సిగ్నల్ పడటంతో బయలుదేరి వెళ్లింది. 40 నిమిషాల పాటు ప్రయాణికులు రైలులో ఇబ్బందులు పడ్డారు. కొంతమంది ప్రయాణికులు రైలు కిందికి దిగి ఏమి జరిగిందోనని ఆరా తీశారు. మరమ్మతులు జరుగుతున్నాయని తెలుసుకున్న ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. రైల్వేట్రాక్ మరమ్మతుల పనులు నత్తనడకన సాగుతుండడంతో రైళ్ల రాకపోకలకు అంతరాయం జరుగుతోందని ప్రయాణికులు వాపోతున్నారు.

వీధిలైట్లకు మరమ్మతు


మరమ్మతులు చేస్తున్న ఎలక్ట్రీషియన్

ఏర్పేడు: మండలంలోని ఎండీ పుత్తూరు పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో మంగళవారం సర్పంచ్ మోహనప్రియ ఆధ్వర్యంలో వీధిలైట్లు మరమ్మతు చేశారు. తొలకరి జల్లులు, గాలులు వీస్తుండడంతో గ్రామాల్లోని వీధిలైట్లు పాడైపోయాయి. గ్రామస్తుల విన్నపం మేరకు లైట్లు మరమ్మతు చేసి, సమస్యను పరిష్కరించారు.

రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలి


బుచ్చినాయుడుకండ్రిగలో రేషన్ బియ్యం పంపిణీ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని చౌకదుకాణాల డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలని డిప్యూటీ తహసీల్దార్ చంద్రబాబునాయుడు తెలిపారు. మంగళవారం ఆయన మండలంలోని బుచ్చినాయుడుకండ్రిగ, గాజులపెళ్లూరు గ్రామాల్లో ఎండీయూ వాహనాల్లో సరుకుల పంపిణీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చౌకదుకాణాల్లో సరుకుల పంపిణీ గురించి గ్రామాల్లో దండోరా వేయించాలన్నారు. సకాలంలో డీడీలు కట్టాలని, ఎండీయూ ఆపరేటర్లు సరుకులను కార్డుదారులందరికీ సక్రమంగా పంపిణీ చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే సరుకులను ఇవ్వాలన్నారు. కార్డులోని ప్రతి ఒక్కరికీ ఐదు కిలోల బియ్యాన్ని అందించాలన్నారు. ప్రతి కార్డుదారుడికీ తప్పనిసరిగా రేషన్ సరుకులు అందేలా చూడాలని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

5 నుంచి పరాశరేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

నారాయణవనం: టీటీడీ అనుబంధ చంపకవల్లి సమేత పరాశరేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు జూలై 5న నుంచి తొమ్మిది రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఆలయాధికారి నాగరాజు తెలిపారు. శుక్రవారం ఉదయం 5.45 నుంచి 6.45 గంటల మధ్య మిథున లగ్నంలో నిర్వహించే ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభవుతాయన్నారు. ప్రతిరోజూ ఉత్సవాల్లో ఉదయం స్నపన తిరుమంజనం సాయంత్రం వాహన సేవ నిర్వహించనున్నట్లు తెలిపారు. శుక్రవారం సాయంత్రం చంద్రప్రభ వాహనసేవ జరుగుతుందన్నారు. జూలై 6 సాయంత్రం సింహవాహనం, 7వ తేదీ రాత్రి హంసవాహనం, 8న రాత్రి శేష వాహనం, 9న నంది వాహనం, జూలై 10న గజవాహనంపై స్వామివారిని ఊరేగించనున్నట్లు తెలిపారు. జూలై 11న రథోత్సవం, 12వ తేదీ సాయంత్రం స్వామి,అమ్మవార్ల కల్యాణోత్సవం, అనంతరం అశ్వ వాహన సేవ నిర్వహించనున్నామన్నారు. జూలై 13వ తేదీ ఉద యం నటరాజస్వామివారి ఉత్సవం, రాత్రి రావణేశ్వర వాహనసేవ జరుగనున్నాయని చెప్పారు. జూలై 14వ తేదీ ఉదయం త్రిశూలస్నానం, అదేరోజు రాత్రి ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయని తెలిపారు. ఈనెల 12వ తేదీన నిర్వహించనున్న ఆర్జిత కళ్యాణోత్సవంలో రూ.500 చెల్లించి పాల్గొనే గృహస్తులకు అన్నప్రసాదాలు, వస్త్ర బహుమానం అందిస్తున్నట్లు నాగరాజు తెలిపారు.

విద్యా రంగ సమస్యలపై స్పందించండి


ఎమ్మెల్యే ఆదిమూలానికి వినతి పత్రం అందజేస్తున్న అపస్ నాయకులు

నారాయణవనం: విద్యా రంగంలో నెలకొన్న దీర్ఘకాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరించాలని సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలంను ఏపీ ఉపాధ్యాయ సంఘం(అపస్) నాయకులు కోరారు. మంగళవారం అపస్ నాయకులు ఆదిమూలాన్ని కలిసి రాష్ట్రంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అపస్ నాయకులు మీడియాతో మాట్లాడుతూ జీఓ నంబర్ 117 రద్దుతోపాటు పాఠశాలల విలీనాన్ని రద్దు చేసి పూర్వస్థితిని కల్పించాలని డిమాండ్ చేశారు. ఏకోపాధ్యాయ పాఠశాలను బహుళ ఉపాధ్యాయ పాఠశాలలుగా మార్చాలన్నారు. గతంలో కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి అన్నపూర్ణా దేవి పార్లమెంట్‌లోని ప్రకటించిన వివరాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించనున్న మెగా డీఎస్సీలో దాదాపుగా 40 వేల ఉపాధ్యాయ ఖాళీలకు నోటిఫికేషన్ ఇవ్వాలని కోరారు. రిటైర్మెంట్‌తో ఖాళీలైన, సబ్జెక్టు టీచర్ల కొరత ఉన్న పాఠశాలలకు పని సర్దుబాటు క్రింద టీచర్లను డిప్యూటేషన్ వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షుడు తూకివాకం నాగరాజు, జిల్లా మీడియా కన్వీనర్ జగదీష్ పాల్గొన్నారు.

డయేరియా నియంత్రణ అందరి బాధ్యత

భాకరాపేట : డయేరియాను నియంత్రించడం మనందరి బాధ్యత అని చిన్నగొట్టిగల్లు ఎంపీడీఓ సోమశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం చిన్నగొట్టిగల్లు మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో అతిసార వ్యాధి నివారణపై ప్రచారం, ర్యాలీలు, సమావేశాలు నిర్వహించడం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే పరిసరాల శుభ్రతపై తరుచూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు అందరినీ భాగస్వాములను చేయాలన్నారు. ఫ్రై డే డ్రైడే కార్యక్రమాలు విధిగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు అందరితో కలసి సహకారం, సమన్వయంతో వ్యవహరిస్తూ డయేరియాను అరికట్టడం మనందరి బాధ్యత అన్నారు.

కెనడా డే పోటీ విజేతలుగా తిరుపతి రచయితలు

తిరుపతి కల్చరల్: కెనడా డే సందర్భంగా అంతర్జాతీయ స్థాయిలో విజేతలుగా తిరుపతి జిల్లా రచయితలు నిలిచారు. తెలుగుతల్లి కెనడా మాస పత్రిక కెనడా డే దినోత్సవంలో భాగా ప్రతి ఏటా నిర్వహించే అంతర్జాతీయ కవితలు, కథల పోటీలు నిర్వహించి బహుమతులతో సత్కరించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా 2024 ఏడాదికి సంబంధించి తిరుపతికి చెందిన కవి, కథా రచయిత పేరూరు బాలసుబ్రమణ్యం కవితల్లో విజేతగా నిలిచారు.

ఈయన 2020లో రాసిన ఆటగదరా శివా కథకు, 2023లో ప్రాణ దాతలు కవితకు బహుమతులు రాగా ఈఏడాది మూడో సా రి నాన్న కవిత బహుమతికి ఎంపిక కావడం విశేషం. అలాగే వీరితో పాటు కథా రచయిత్రి ఎంఆర్.అరుణకుమారి రాసిన మరుజన్మకు నువ్వే కథకు, రచయిత రాచపూటి రమేష్ రాసిన ఆ నాటి చెలిమి కథకు బహుమతులు లభించాయి. అంతర్జాతీయ పోటీలలో విజేతలుగా ఎంపికైన వీరిని అభ్యుదయ రచయిత సంఘం నేతలు సాకం నాగరాజు, యువశ్రీ మురళి, డాక్టర్ నెమిలేటి కిట్టన్న, రచయితలు ఆర్‌సీకే.రాజు, మన్నవ గంగాధరప్రసాద్, వాకా ప్రసాద్‌తో పాటు పలువురు సాహితీ ప్రియులు అభినందించారు.

పోరాటానికి సిద్ధం కావాలి

తిరుపతి కల్చరల్: కొత్తకొత్త చట్టాలతో తిరుపతి ట్రాఫిక్ ఆంక్షలతో ఆటో కార్మికులపై పెనుభారం మోపుతున్న నేపథ్యంలో, అందుకు వ్యతిరేకంగా ఆటో కార్మికులంతా సంఘటితమై సమరానికి సిద్ధం కావాలని ఏఐటీయూసీ నగర అధ్యక్ష, కార్యదర్శులు సురేష్, వెంకటేష్ పిలుపునిచ్చారు. ఎంఆర్ పల్లి సర్కిల్లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆటో స్టాండ్‌ను వారు ప్రారంభించారు. అలాగే ఏఐటీయూసీ ఆటో కార్మిక సంఘం స్టిక్కర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిగ్నల్ పాయింట్ల వద్ద విపరీతమైన ట్రాఫిక్ ఆంక్షలు, పెనాల్టీలు వేస్తూ భయాందోళనలకు గురి చేస్తున్నారని తెలిపారు. మరోవైపు ఫైనాన్స్ ఆగడాలు ఎక్కువయ్యాయని తిరుపతి నగరంలో ఆటోలు నిలపరాదని ఆటో స్టాండ్ల వద్దకు వెళ్లి పోలీసులు బెదింపులకు దిగడం విడ్డూరమన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఆటో కార్మికులకు అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి 50 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికీ రూ.6 వేలు ఫించన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

14 నుంచి సౌమ్యనాథస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

తిరుపతి(అలిపిరి): అన్నమయ్య జిల్లా నందలూరు శ్రీ సౌమ్యనాథ స్వామి వార్షిక బ్రహ్మోత్సవా లు ఈనెల 14 నుంచి 22వ తేదీ వరకు వైభవంగా జరుగనున్నాయని మంగళవారం టీటీడీ జేఈ ఓ వీరబ్రహ్మం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బ్రహ్మోత్సవాలకు ఈనెల 13న అంకురార్పణ నిర్వహిస్తారని, 14న ఉదయం 7.45 నుంచి 8.15 గంటల వరకు కర్కాటక లగ్నంలో ధ్వ జారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. బ్రహ్మోత్సవాల్లో రోజూ ఉదయం 8, రాత్రి 7 గంటలకు వాహనసేవలు జరుగనున్నాయన్నారు. 14వ తేదీ ఉదయం ధ్వజారోహణం, రాత్రి యాలి వాహనం, 15 ఉదయం పల్లకీ సేవ, రాత్రి హంస వాహనం, 16 ఉదయం పల్లకీ సేవ, రాత్రి సింహవాహనం, 17న ఉదయం పల్లకీ సేవ, రాత్రి హనుమంత వాహన సేవ జరుగుతుందన్నారు. 18 ఉదయం శేష వాహనం, రాత్రి గరుడ వాహనం, 19 ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రి చంద్రప్రభ వాహన సేవలు నిర్వహిస్తామన్నారు. ఈ నెల 20న ఆర్జిత కల్యాణోత్సవం (ఉదయం 10 గంటలకు), రాత్రి గజ వాహనం, 21న ఉదయం రథోత్సవం, రాత్రి అశ్వవాహనం, 22న ఉదయం చక్రస్నానం, రాత్రి ధ్వజావరోహణం కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 20న ఉదయం 10 గంటలకు ఆర్జిత కల్యాణోత్సవం జరుగుతుందని పేర్కొన్నారు. గృహస్తులు(ఇద్దరు) రూ.500 చెల్లించి కల్యాణోత్సవంలో పాల్గొనవచ్చన్నారు. గృహస్తులకు ఒక ఉత్తరీయం, రవికె, అన్నప్రసాదాలు బహుమానంగా అందజేస్తారని తెలిపారు. జూలై 23న సాయంత్రం 6 గంటలకు పుష్పయాగం నిర్వహించనున్నామన్నారు. ఉత్సవాల సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు, దాససాహిత్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో రోజూ ఆధ్యాత్మిక, భక్తి సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

నేడు పల్లికొండేశ్వరాలయంలో ప్రదోష పూజలు



నాగలాపురం: మండలంలోని సురుటుపల్లి గ్రామంలో ఉన్న శ్రీ సర్వ మంగళ సమేత శ్రీ పల్లికొండేశ్వర స్వామి ఆలయంలో బుధవారం సాయంత్రం ప్రదోష పూజలు జరుగుతాయని ఆలయ కార్య నిర్వహణ అధికారి కె.రామచంద్రారెడ్డి తెలిపారు. సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు ప్రదోష మండపంలో నందీశ్వరునికి, వాల్మీకీశ్వర స్వామివారికి, మరగదాంబిక అమ్మవారికి ఏక కాలంలో విశేష అలంకరణలు, అభిషేకాలు, మహాహారతి కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. ప్రదోష పూజలో పాల్గొనదలచిన వారు రూ.500 చెల్లించి రసీదు పొంది పాల్గొనాలని తెలిపారు.

స్టాప్ డయేరియా కార్యక్రమంపై అవగాహన


సమావేశంలో మాట్లాడుతున్న సీహెచ్‌ఓ వేంకటేశ్వర్లు

బుచ్చినాయుడుకండ్రిగ: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం స్టాప్ డయేరియా కార్యక్రమంపై వైద్యాధికారి దివాకర్, ఎంపీడీఓ త్రివిక్రమ్ రావు, సీహెచ్‌ఓ వేంకటేశ్వర్లు, ఆశా, అంగన్‌వాడీ, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో డయేరియా విజృభించకుండా ప్రభుత్వం స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. గ్రామాల్లోని ప్రజలకు డయేరియాపై అవగాహన కల్పించి, సూచనలు, సలహాలు ఇవ్వాలని తెలిపారు. కలుషిత నీరు, ఆహార పదార్థాలను తీసుకోవడంతో టైఫాయిడ్, డయేరియా తదితర వ్యాధులు వస్తాయని, దోమలతో మలేరియా, వైరల్ ఫీవర్లు, డెంగీ, చికెన్ గున్యా తదితర వ్యాధులు వస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతతోపాటు వ్యక్తిగత శుభ్రత పాటిస్తే కొంత వరకు వ్యాధులను అరికట్టవచ్చునని వారు తెలిపారు. ప్రతి శుక్రవారం డ్రైడేను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ రాజశేఖర్, పాల్గొన్నారు.

గంగమ్మ శక్తిపీఠం గ్రిల్స్ ధ్వంసం


గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ధ్వంసమైన గ్రిల్స్

సత్యవేడు: గుర్తు తెలియని వాహనం సోమవారం రాత్రి నడివీధి గంగమ్మ శక్తిపీఠానికి ఏర్పాటు చేసిన స్టీల్ గ్రిల్స్‌ను ఢీకొనడంతో అవి విరిగిపోయాయి. సత్యవేడు నడివీధి గంగమ్మ శక్తిపీఠం వద్ద భక్తులు పూజలు చేసుకునేందుకు అనువుగా స్టీల్‌గ్రిల్స్ ఏర్పాటు చేశారు. కొన్ని నెలల నుంచి సత్యవేడు మీదుగా లారీలు అధిక సంఖ్యలో తమిళనాడుకు వెళుతున్నాయి. వీటితోపాటు పీవీ పురం వద్ద ఉన్న క్వారీల నుంచి జల్లి, కంకర తరలిస్తున్న లారీలు సత్యవేడులో అధిక వేగంతో వెళుతున్నాయి. లారీల వేగానికి బాటసారులు , విద్యార్థులు, ద్విచక్ర వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. స్థానిక పోలీసులు వాహనాలు గాంధీరోడ్డు, నేతాజీ రోడ్డులో మితిమీరిన వేగంతో వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించండి


నీళ్లతొట్టి కండ్రిగ పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న ఎంఈఓ కె.రవి

సత్యవేడు: ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిషు మీడియంతో కూడిన నాణ్యమైన విద్యాబోధన జరుగుతోందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని ఎంఈఓ–1 కె.రవి కోరారు. నీళ్లతొట్టి కండ్రిగ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ మంగళవారం తనిఖీ చేశారు. ప్రాథమిక పాఠశాలలో అడ్మిషన్లపై ఆరా తీశారు. విద్యార్థులకు నోటు పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు, బ్యాగు, బూట్లు, సాక్స్‌లు బెల్టులు, మూడు జతల యూనిఫామ్ ఇస్తున్నట్లు తెలిపారు. అందరూ ఈ సౌకర్యాలను వినియోగించుకోవాలని కోరారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థులకు పోషక విలువలు కలిగిన మధ్యాహ్న భోజనంలో మెనూ ప్రకారం తయారు చేసిన గుడ్డు, అన్నం, ఆకుకూర భోజనాన్ని పరిశీలించి, రుచి చూశారు. విద్యార్థులకు నాణ్యతగా వండి వడ్డించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ–2 ఉషా, ప్రధానోపాధ్యాయుడు ఎస్.వెంకటేశ్వర్లు, ఎం.మునికృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ సాగుతోనే ఆరోగ్యం


సేంద్రియ సాగుపై అవగాహన కల్పిస్తున్న ఇంజనీరింగ్ విద్యార్థులు

నారాయణవనం: సేంద్రియ పద్ధతులతో సాగు చేసిన ఆహార ఉత్పత్తులతోనే ఆరోగ్యకర జీవనాన్ని సాగించివచ్చని పాలమంగళం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మనోహరి పేర్కొన్నారు. పుత్తూరులోని వెంకట పెరుమాళ్ ఇంజనీరింగ్ కళాశాల తృతీయ సంవత్సరం ఈసీఈ విద్యార్థులు కమ్యూనిటీ సర్వీసెస్ ప్రాజెక్ట్‌లో భాగంగా మంగళవారం సేంద్రియ సాగుపై విద్యార్థులకు అవగాహన కల్పించి, పాఠశాల క్రీడా మైదానంలో మొక్కలు నాటారు. రసాయన ఎరువులతో భూ క్షామంతో పాటు నాణ్యత, పోషకాలు లేని ఆహార ఉత్పత్తులతో అనర్థాలు, పర్యావరణ కాలుష్యం, జీవ పరిణామంపై ప్రభావం తదితర అంశాలపై వీడియో రూపంలో విద్యార్థులకు ఇంజినీరింగ్ విద్యార్థులు అవగాహన కల్పించారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు సేంద్రియ, ప్రకృతి, ఆర్గానిక్ వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించాలని ప్రాజెక్ట్ లీడ్ హెమంత్ అన్నారు. హెచ్‌ఎం మనోహరి మాట్లాడుతూ మనం ఆరోగ్యంగా ఉండాలంటే భూమితో పాటు వాతావరణం కలుషితం కాకుండా ఉండాలన్నారు. సేంద్రియ, ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో భూమి, వాతావరణ పరిరక్షణ జరుగుతుందని చెప్పారు. వేడిని తగ్గించడానికి మొక్కలు విధిగా నాటి పెంచాలని అన్నారు. నేటి నుంచి ప్రతి విద్యార్థీ తమ ఇంటి వద్ద ఒక్కో మొక్కను నాటి సంరక్షించడాన్ని దినచర్యతో భాగంగా చేసుకోవాలని పులుపునిచ్చారు.

ఐక్య ఉద్యమాలతోనే ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కారం


రాణెమ్మను సన్మానిస్తున్న సహోద్యోగులు

శ్రీకాళహస్తి: ఐక్య ఉద్యమాలతోనే ఆశావర్కర్ల సమస్యలు పరిష్కారం అవుతాయని ఏపీ యునైటెడ్ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి టి మునేంద్ర అన్నారు. శ్రీకాళహస్తి మండలం ఎంపేడు పీహెచ్‌సీలో పనిచేస్తున్న సీహెచ్ రాణెమ్మ ఉద్యోగ విరమణ మంగళవారం పొందారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు సన్మానించారు. ఆయన మాట్లాడుతూ ఆశావర్కర్లు ఐక్యంగా ఉద్యమించాలన్నారు. ప్రభుత్వాలు మారినా వారి సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదని తెలిపారు. ఆశా వర్కర్లు 60 ఏళ్ల వయసులో రిటైర్డ్ అవుతున్నా జీవిత భద్రత లేకపోవడడం అన్యాయమన్నారు. ఉద్యోగ విరమణ పొందుతున్న వారికి రూ.5 లక్షలు ఇవ్వాలని, ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. రాణెమ్మకు ఆశా వర్కర్ల యూనియన్ రూ.20 వేలు ఆర్థికసాయం చేశారు. ఈ కార్యక్రమంలో కుమార్‌రెడ్డి, జహీరా, పవనమ్మ, హరీష్, లక్ష్మి, తులసి, శాంతకుమారి, భారతి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు


పొలాలను పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవసాయి డీపీఎం షణ్ముగం

రామచంద్రాపురం: రైతులు ప్రకృతి వ్యవసాయం ఆచరించి సాగు చేపట్టడం ద్వారా అధిక లాభాలను పొందవచ్చని డీపీఎం షణ్ముగం అన్నారు. మంగళవారం మండలంలోని అనుప్పల్లి, సీకాలేపల్లి, నెత్తకుప్పం, వేపకుప్పం, రాయలచెరువు, కుప్పంబాదూరు గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం ఆచరించే రైతుల పొలాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు మిశ్రమ పంటల వల్ల కలిగే లాభాలను గురించి వివరించారు. అలాగే జీవామృతం, బీజామృతం కషాయాల తయారీని తెలియజేశారు. గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ అవగాహన ర్యాలీలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ రాష్ట్ర సీనియర్ కన్సల్టెంట్ సురేంద్రరెడ్డి, అడిషనల్ డీపీఎం పట్టాభిరెడ్డి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.